'తెలుగు' అమలుకు రాష్ట్ర సర్కారు కట్టుబడి ఉంది

జూలూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు భాష సంపూర్ణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. సిఎం కెసిఆర్‌కు తెలుగు భాషపై ఉన్న ప్రేమతోనే హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారనీ, సాహిత్య అకాడమిని పునరుద్ధరించారని గుర్తు చేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో కవులు, రచయితలతో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా తెలుగు భాషాభివృద్ధికి అకాడమి ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే 'మన ఊరు - మన చెట్లు' పేరుతో కథల పోటీలు నిర్వహిస్తే ఐదు లక్షల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ మాతృభాషను బతికించుకునే పని ప్రతిఒక్కరూ తమ ఇంటి నుంచే మొదలుపెట్టాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ.. ప్రతిపాఠశాలలోనూ తెలుగును సబ్జెక్టుగా బోధించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ.. మాతృభాష క్షీణించడానికి కారణాలు అన్వేషించకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉపయోగం ఉండదనీ, మనం మనుషులుగా బతికితేనే భాష కూడా సజీవంగా ఉంటుందని అన్నారు. భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.

మోడల్ స్కూల్స్ ప్రవేశాల గడువు పొడిగింపు

మార్చి 1 వరకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. దరఖాస్తుల సమర్పణకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశముందని పేర్కొంది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఉషారాణి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ఒక్కో పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

భగత్‌సింగ్ పరిపూర్ణ కమ్యూనిస్టు

- సమసమాజమే విప్లవం లక్ష్యం
- రెడ్ బుక్స్‌డే కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడే కాకుండా పరిణితి చెందిన కమ్యూనిస్టు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. చనిపోవడమే త్యాగం కాదన్నారు. పాలకుల నిర్బంధం ఉన్నా ప్రజల కోసం పనిచేయడమే విప్లవకారులకు పెద్ద సవాల్ అనీ, అదే గొప్ప త్యాగమనీ ఆయన వ్యాఖ్యానించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలనీ, ఆ సిద్ధాంతానికి చివరిదాకా కట్టుబడి ఉండాలనీ చెప్పారు. ఆ లక్షణాలున్న భగత్ సింగ్‌ను మార్గదర్శిగా తీసుకొని ఆయన ఆశయాల కోసం పనిచేయాలని తమ్మినేని పిలుపునిచ్చారు. రెడ్ బుక్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తక సామూహిక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళి విముక్తి కోసం మార్క్స్-ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు మ్యానిఫెస్టో గ్రంథాన్ని గతేడాది పఠించామన్నారు. ఈ ఏడాది భగత్‌సింగ్ పుస్తకాన్ని చదువుతున్నామని చెప్పారు. హింస ద్వారానైనా బ్రిటీష్ వారిని పారదోలాలంటూ భగత్‌సింగ్ భావించారని వివరించారు. పార్లమెంటు మీద బాంబు వేసిన ఘటనలో 1931, మార్చి 23న అతిచిన్న వయస్సులో ఉరికంబం ఎక్కిన గొప్ప దేశభక్తుడు ఆయన అని చెప్పారు. 1925లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. భారతదేశంలో మార్క్సిజం పట్ల పూర్తిస్థాయి అవగాహన లేని కాలంలో పరిపూర్ణ కమ్యూనిస్టుగా భగత్‌సింగ్ పరిణితి చెందారని అన్నారు. అయితే ప్రగతిశీల భావాలున్న బుద్ధుడు, అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ వంటి వారిని కమ్యూనిస్టులు సొంతం చేసుకోలేదని వివరించారు. మనువాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించి పోరాడిన అంబేద్కర్‌ను బిజెపి సొంతం చేసుకుంటున్నదని చెప్పారు. అభ్యుదయ భావాలను ఒడిసి పట్టుకోవాలనీ, అలాంటి వారిని కమ్యూనిస్టు పార్టీ సొంతం చేసుకోవాలని కోరారు. దోపిడీని, అన్యాయాన్ని ఎదిరించడం, సమాజాన్ని మార్చడమే విప్లవమని వివరించారు. సమసమాజంగా మార్చడం విప్లవ లక్ష్యమన్నారు.

దేవున్ని విమర్శించడానికే పరిమితం కావొద్దు

మానవ సమాజాన్ని, డార్విన్ పరిణామ క్రమ సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్న తర్వాత భగత్‌సింగ్ హేతువాదిగా మారాడని తమ్మినేని చెప్పారు. విమర్శించినంత మాత్రాన మనుషుల భావాల్లోనుంచి దేవుడు పోడని అన్నారు. దేవుడు ఎందుకు అవసరమయ్యారనే, ఆ కారణాన్ని తార్కికంగా ఆలోచించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గూపులు, హింస, తుపాకుల ద్వారా విప్లవం రాదని తమ్మినేని వ్యాఖ్యానించారు. సాధారణ ప్రజలను సమీకరించి పోరాడితేనే విప్లవం వస్తుందంటూ భగత్‌సింగ్ చెప్పారని గుర్తు చేశారు. రైతాంగం, కార్మికుల్లో చైతన్యం పెంచినప్పుడే విప్లవం జయప్రదమవుతుందని వివరించారు. తాత్కాలిక కోర్కెల కోసం రాజీపడాలనీ, అంతిమ లక్ష్యాన్ని వీడొద్దని సూచించారు. వ్యక్తిగత జీవితం కంటే సిద్ధాంతం ఎంతో గొప్పదని చెప్పారు. వృత్తి విప్లవకారులు ఆ దిశగా పయనించాలని కోరారు. భగత్‌సింగ్‌ను ప్రతిఒక్కరూ మార్గదర్శిగా తీసుకోవాలని సూచించారు.

రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి : బి వెంకట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మనుధర్మాన్ని అమలు చేయాలనీ, హిందూ రాజ్యాన్ని నిర్మించాలనీ బిజెపి కుట్ర పన్నుతున్నదని చెప్పారు. ఈ రాజ్యాంగముంటేనే దేశ ప్రజలు ఐక్యంగా ఉంటారనీ, హక్కులు పరిరక్షించబడతాయనీ, ప్రభుత్వరంగ సంస్థలుంటాయనీ వివరించారు. పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలనీ, సమాజాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ మాట్లాడుతూ సామూహిక పుస్తక పఠనం కార్యక్రమం వచ్చేనెల 23 (భగత్‌సింగ్ వర్ధంతి) వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి జ్యోతి, మల్లు లక్ష్మి, పి ప్రభాకర్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్

మాజీ ఎంపి హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోకు మద్దతుగా మార్చి 22 నుంచి 25వ తేదీ వరకు భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని మాజీ ఎంపి వి హనుమంతరావు వెల్లడించారు. రాజీవ్‌గాంధీ పేరుతో 15 ఏండ్ల నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈసారి భారత్ జోడో ఆలిండియా అండర్ 19 టీ 20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 17టీమ్స్ పాల్గొంటాయని తెలిపారు.

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కుక్కల దాడిలో మరణించిన బాలుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విహెచ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కుక్కల వలన చాలా మంది పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల నియంత్రణ చేపట్టాలన్నారు. వీధి కుక్కలను నియంత్రణ చేయకపోతే చిన్న పిల్లలపై దాడులు పెరుగుతాయని హెచ్చరించారు.

బిఆర్ఎస్ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలి

సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూత్ కాంగ్రెస్ నేత తోట పవన్‌పై దాడికి పాల్పడిన బిఆర్ఎస్ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న పవన్‌పై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. దాడిని ప్రోత్సహించిన, దాడికి పాల్పడిన నిందితులను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడం సరికాదని తెలిపారు.

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి

ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలు

- ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించండి
- అధికారులకు మంత్రి సబిత ఆదేశం
- 1,473 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చేనెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీవరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ పరీక్షలకు 9,51,022 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే కేంద్రాల్లోకి వచ్చి తమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో హైపవర్ కమిటీలను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేశామనీ, పరీక్షల నిర్వహణ బాధ్యత ఈ కమిటీలదేననీ మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల్లో అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిఘా ఉంచేందుకు, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలనీ, తప్పనిసరిగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి విద్యార్థులు చేరుకునే విధంగా బస్సులను నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి జిల్లాకూ ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో ప్రవేశాలకు చివరితేది మార్చి 10

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన పిజి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులకు చివరి తేదీ మార్చి పదో తేదీ వరకు ఉంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఎవిఎన్ రెడ్డి, కామర్స్ విభాగం డీన్ ఆనంద్ పవార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిజి డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పిజి డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, పిజి డిప్లొమా ఇన్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలుంటాయని వివరించారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్హతలు, ఫీజు, కోర్సుల వివరాలను www.braouonline.in లేదా www.braou.ac.in వెబ్‌సైట్ల ద్వారా చూడాలని కోరారు.

కళలు ఏ ఒక్క వర్గానికి పరిమితం కావు

- డాక్టర్ ఎన్.గోపి

ప్రజాశక్తి-కల్చరల్

కళలు ఏ ఒక్క వర్గానికి పరిమితంకావని విశ్వనాథ్ సినిమాల్లో సందేశం ఉంటుదని ప్రముఖ కవి డాక్టర్ ఎన్.గోపి అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత దర్శకుడు కె.విశ్వనాథ్ జయంతి, అంతర్జాతీయ భాషా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గోపి పాల్గొని మాట్లాడుతూ విశ్వనాథ్ సినిమలు సంస్కారవంతంగా కులం కంటే గుణం మిన్న అనే సందేశం కూడి ఉంటాయని వివరించారు. సాహితీవేత్త గరికపాటి వెంకట్, రాజగోపాల్‌రావు మాతృభాష ప్రాధాన్యత తెలిపారు. కిన్నెర రఘురాం స్వాగతం పలికారు. వై.ఎస్.రామకృష్ణ బృందం పాడిన పాటలు శ్రీతలను రసానందంలో తేలించాయి.

తెలంగాణ మాండలిక పద ప్రయోగశీలి యశోధర రెడ్డి

- ఎమ్మెల్సీ బి.దయానంద్

ప్రజాశక్తి-కల్చరల్

నవల, కథ, కవిత ఏ సాహితీ ప్రక్రియల్లోనైనా తెలంగాణ మాండలిక పదాలను ప్రయోగాత్మకంగా ఉపయోగించే సాహితీమూర్తి యశోధర రెడ్డి అని శాసన మండలి సభ్యుడు బి.దయానంద్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ పాకాల యశోధర రెడ్డి జయంతి సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా దయానంద్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో ఎందరో రచయితలు ప్రత్యేకంగా మహిళా సాహితీవేత్తలు ఉన్నారని, సమైక్య రాష్ట్రంలో వారికి తగిన ప్రాధాన్యత, గుర్తింపు రాలేదన్నారు. యశోధర రెడ్డి తెలంగాణ సాహిత్యంలో తొలి తరం రచయిత్రి అని పేర్కొన్నారు.

గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీవేత్త వెలమకని రమణ, కళా పోషకుడు వై.ఎస్.ఆర్.మూర్తి, పిలుపు సంపాదకులు కొల్లి నాగేశ్వరరావు పాల్గొనగా చక్రపాణి వందన సమర్పణ చేశారు.

రీ సైక్లింగ్‌తో ప్రభుత్వానికి ఆదాయం

- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రసాయనిక ఎరువులు వాడకం వల్ల క్యాన్సర్ వేగంగా విస్తరిస్తుందని, దాంతో ఆర్థికంగా, శారీరకంగా పూర్తిగా దెబ్బతింటోంది, భూమి సారాన్ని కాపాడుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పత్తి మార్కెట్ ఆవరణలో 'భూమిత్ర-మన తడిచెత్త- మన సేంద్రియ ఎరువు- మన నేల' సిద్దిపేట బ్రాండ్‌తో జీవ సంపన్న సేంద్రియ ఎరువులను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమిత్ర సిద్దిపేట 41,322 మంది ప్రజల విజయమన్నారు. ప్రజలు నిత్యం తడి, పొడి, హానికారకమైన చెత్త వేర్వేరుగా ఇవ్వడంతో సాధ్యమైందన్నారు.

సిద్దిపేటలో 34 మెట్రిక్ టన్నుల చెత్త ప్రతి రోజు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. ఇందులో తడి చెత్త 27 లక్షల మెట్రిక్ టన్నులు, 4 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, మిగతాది హానికారకమైన చెత్త వస్తుందని చెప్పారు. తడి చెత్తను ఎరువుగా, పొడి చెత్తను రీ సైక్లింగ్‌కు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సిమెంట్ కర్మాగారానికి విక్రయిస్తున్నట్టు తెలిపారు. చెత్తను వెల్త్ ఆఫ్ వేస్ట్‌గా మార్చుకోవడం సిద్దిపేట మున్సిపాలిటీ గొప్పతనమన్నారు. వీటి ద్వారా ప్రతి నెలా 4,500 కిలోల గ్యాస్, 100 మెట్రిక్ టన్నుల ఎరువుల ఉత్పత్తి అవుతున్నదన్నారు. గ్యాస్ ద్వారా రూ.3 లక్షలు, ఎరువుల ద్వారా రూ.7.3 లక్షలు, పొడిచెత్త ద్వారా రూ.11.30 లక్షలు, మొత్తం రూ.21 లక్షలకుపైగా ఆదాయం చెత్త నుంచి వస్తుందని తెలిపారు.

వ్యవసాయ డ్రోన్ స్ప్రేయర్ పంపిణీ

మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ డ్రోన్ స్ప్రేయర్లను మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేశారు. వ్యవసాయ పరికరాలు చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులో తేవడానికి, తక్కువ రేటుకు అద్దెకు ఇవ్వడానికి మండల సమాఖ్య ఆధ్వర్యంలో కస్టమ్ హెరింగ్ సెంటర్స్-వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో 21 మండల సమాఖ్యలు- రాయపోల్, సిద్దిపేట అర్బన్ మినహా సీహెచ్ సీలను రూ.3.05 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 75 శాతం, ఎంఎస్ సొంత నిధులు రూ.2.09 కోట్లు, 25 శాతం ఎస్.ఆర్.ఎల్.ఎం రూ.96 లక్షలు వెచ్చించినట్టు వివరించారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మెన్ మచ్చ విజిత వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మంజుల-రాజనర్సు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

- నరసింహ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మతమౌఢ్యాన్ని ప్రచారం చేస్తూ.. హింస, ఉన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బిజెపిని ఓడించడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. గోపురాలను కూల్చడం.. మసీదులను తవ్వడమే బిజెపి విధానమని విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సిపిఎం నాయకులు నరసింహ 32వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి వ్యక్తి చనిపోక తప్పదని, చావు పుట్టుకల మధ్య ఉన్న జీవితమే చరిత్రగా నిలుస్తుందన్నారు. 32 ఏండ్ల తర్వాత నరసింహ వర్ధంతిని ఇంత ఘనంగా నిర్వహిస్తున్నారంటే ఆయన జీవితం సార్థకం అయిందన్నారు. ఫొటో ముందు దండం పెట్టి గుర్తు చేసుకోవడం కాదు.. ఆయన ఆశయం కోసం ఉద్యమాల బాట పట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండానే మార్గమని నమ్మిన నరసింహ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు సమాజమే ప్రత్యామ్నాయమని చెప్పారు. వ్యక్తిని, ముఖ్యమంత్రిని, పార్టీని మార్చడం కాదు దోపిడీ వ్యవస్థనే మార్చాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాల వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతుందేమో కానీ పేదరిక నిర్మూలనకు శాశ్వత పరిష్కారం దక్కదన్నారు. సమ సమాజం ఏర్పడాలంటే కమ్యూనిజమే పరిష్కారమన్నారు. విద్య వైద్యం ఉపాధి కమ్యూనిస్టు సమాజంలోనే సాధ్యమవుతుందని చెప్పారు. దున్నేవాడికి భూమి ఉండాలన్నారు. దున్నేవాడికే భూమి.. నినాదంతో తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. దళిత బంధు, బీసీ, మైనార్టీ బంధులను అందరికీ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సీఎం కేసీఆర్‌ను నిలదీస్తూనే ఉంటామని చెప్పారు. కేంద్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న మోడీ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని మరిచి కరోనా సమయంలో ఉన్న ఉద్యోగాలు ఊడబెరికారని ఆవేదన వ్యక్తం చేశారు.

కనీస వేతన చట్టం అమలు, స్వయం ఉపాధి బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతకుముందు నరసింహ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, వీపనగండ్ల మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, నాయకులు నాగిరెడ్డి ఆనంద్, ఉప సర్పంచ్ మౌలాలి, మండల రాజు, గిరిజన సంఘం నాయకులు బాల్యానాయక్, మంజుల, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆది, ఐద్వా నాయకులు ఉమా, నరసింహ కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- వింటేజ్ వెంచర్‌లోని ఫామ్‌హౌజ్‌పై పోలీసుల దాడి
- ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వింటేజ్ క్లాసిక్ వెంచర్‌లోని ఫామ్‌హౌజ్‌లో సోమవారం అర్ధరాత్రి పోలీసులు హైటెక్ వ్యభిచార ముఠా గుట్టును రట్టు చేశారు. యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎటిహెచ్‌యు), స్థానిక పోలీసులకు అందిన విశ్వాసనీయ సమాచార మేరకు ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో యువతితోపాటు ఐదుగురు విటులను అరెస్ట్ చేశారు. వారిని కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొత్తూరు సిఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన బొల్లు శ్రీకాంత్, పెద్ద తండాకు చెందిన పాత్లావత్ రాజు, చిన్న తూప్రా గ్రామానికి చెందిన సంకటి నాగరాజు, మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పెండ్లిమడుగు నవీన్, నల్లచెరువు తండాకు చెందిన దన్నుల రవిలు వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఒక యువతిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. ఆమెను కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వింటేజ్ క్లాసిక్ వెంచర్‌లోని ఫామ్‌హౌస్‌లోకి తీసుకొచ్చారు. అక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండగా సోమవారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు కార్లు, 9 సెల్ ఫోన్లు, రూ.16 వేల నగదుతో పాటు 20 కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు వ్యభిచార ముఠా నిర్వాహకులు పరారీలో ఉన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కొబ్బరి బొండాల మాటున గంజాయి స్మగ్లింగ్

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొబ్బరిబొండాల మాటున గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ఉప సర్పంచ్ సహా నలుగురు ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్ ఆత్మకూర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. కటాక్షపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి పి.కరుణాకర్ వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ములుగు జిల్లా నుంచి వరంగల్ జిల్లా వైపు వస్తున్న బోలేరో వాహనంలో సుమారు 170 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.34 లక్షల ఉంటుంది. విషయం తెలుసుకున్న ఈస్ట్‌జోన్ డిసిపి పి.కరుణాకర్, పరకాల ఎసిపి జూపల్లి శివరామయ్య కటాక్షపూర్ చేరుకొని పరిశీలించారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో నీరుకుల్ల ఉపసర్పంచ్ లక్ష్మణ్ ఓ ముఠాను తయారు చేసుకొని ఏపిలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రెండు కిలోల చొప్పున గంజాయిని ప్యాకింగ్ చేసి ఎవరికీ అనుమానం రాకుండా వాటి పైన కొబ్బరి బోండాలతో బోలేరో వాహనంలో రవాణా చేస్తున్నారు. వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసుల కండ్లు కప్పి బొలెరో వాహనంతోపాటు ఎస్కార్డ్ వాహనం షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ప్రధాన నిందితులు నీరుకుల్ల ఉపసర్పంచ్ ముసుకు లక్ష్మణ్, శంకర్లు తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వాహనాన్ని అడ్డగించి తనిఖీ చేశారు. వారి నుంచి 170 కిలోల ఎండు గంజాయి, ఒక కారు, గంజాయి రవాణాకు వినియోగించిన బోలెరా వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నీరుకుల్ల ఉపసర్పంచ్ ముసుకు లక్ష్మణ్‌తోపాటు రాయినేని శంకర్, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గోరుకొత్తపల్లి, ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన మాట మహేష్, ములుగు జిల్లా పస్రా గ్రామానికి చెందిన గండికోట సతీష్‌లను అరెస్టు చేసినట్టు డిసిపి తెలిపారు. మరో ఇద్దరు నిందితులతో కలిపి ఆంధ్రప్రదేశ్ నర్సీపట్నంలోని నూకరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ బి.కుమార్, ఎస్ఐలు లవణకుమార్, నిసార్పాషా, హెడ్‌కానిస్టేబుల్ స్వర్ణలత, కానిస్టేబుళ్ళు శ్యామ్, రాజు, బిక్షపతి, సురేష్, శ్రవణ్ నవీన్, కరుణాకర్లను ఈస్ట్ జోన్ డిసిపి అభినందించారు.

ప్రజాభిప్రాయ సేకరణను పరిగణలోకి తీసుకోవాలి

- ఇథనాల్ ఫ్యాక్టరీని ఎత్తేయాలి
- తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెమికల్ ఫ్యాక్టరీ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణను పరిగణలోకి తీసుకోవాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ ప్రభుత్వాన్ని కోరారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చేపడుతున్న ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీ అనుమతిని నిరసిస్తూ చిత్తనూరు పరిసర గ్రామాల ప్రజలు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర ఈ నెల 11న బయలుదేరి 178 కిలోమీటర్లు నడిచి మంగళవారం ఆత్మకూరు పట్టణంలో ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో కోదండరామ్ మాట్లాడుతూ. మరికల్ మండలం చిత్తనూరు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీనీ వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీని అభినందించారు. ప్రజలంతా ఏకమై పది రోజులు పాదయాత్రగా వివిధ గ్రామాలను తిరుగుతూ సంఘటితంగా తమ పోరాటాన్ని నిర్వహిస్తున్నందుకు వారిని అభినందిస్తున్నట్టు చెప్పారు. ఫ్యాక్టరీ విషయంలో మొదట ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోవాలన్నారు. మోసపూరితంగా ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అదే విధంగా ఈ ఫ్యాక్టరీలో బియ్యం, మొక్కజొన్న, చెరుకు రసంతో తయారు చేసిన ఆయిల్‌ను పెట్రోల్‌లో కలుపుతారని తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే వ్యర్థ పదార్థాల వల్ల సమీప ప్రజలకు వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. కంపెనీని వెంటనే వెనక్కి తీసుకోవాలని, అనుమతి ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మ, రైతు సంఘం కౌన్సిల్ సభ్యులు నీతూ, ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఎంఐఎంకు బిఆర్ఎస్ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థికి మద్దతివ్వనున్నట్టు బిఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు బిఆర్ఎస్ అధినేత, సిఎం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో మాదిరిగానే హైదరాబాద్ స్థానిక సంస్థల సీటులో తమకు మద్దతు తెలపాలని ఎంఐఎం పార్టీ బిఆర్ఎస్‌ను కోరిన విషయం విదితమే. ఈ మేరకు పార్టీ సీనియర్లతో చర్చించిన తర్వాత బిఆర్ఎస్ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నది.

పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి

- మంత్రి సత్యవతి రాథోడ్‌కు సమన్వయ కమిటీ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ వాగ్దానం చేసినట్టుగా పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలనీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాలు-2022ను ఉపసంహరించు కోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కోరుతూ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్లు వేములపల్లి వెంకట్రామయ్య, అంజయ్య నాయక్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, కోశాధికారి అమర్లపూడి రాము, సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య, ప్రసాదన్న పాల్గొన్నారు. తిరస్కరించిన దరఖాస్తులను పున:పరిశీలించాలని మంత్రిని కోరారు. అటవీ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా రకరకాల నెపాలతో దరఖాస్తులను తిరస్కరించడాన్ని సమన్వయ కమిటి వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే వాటిపై పరిశీలన చేయాలని కోరారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తాటి,ఈత వనాలను సంరక్షించాలి

- కల్లుగీత కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఐదు లక్షల కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించే తాటి, ఈత చెట్లను రియల్టర్లు ధ్వంసం చేస్తున్నారని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం వల్ల తాటి, ఈత చెట్లను విపరీతంగా నరికేస్తున్నారని తెలిపారు. వాటికి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం..నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారంలో లక్షలాది చెట్లను నాటుతున్న సర్కారు.. తాటి, ఈత చెట్లను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం భూమి కొనుగోలు పథకంలో 439 సొసైటీలకు ఐదెకరాల చొప్పున భూములు ఇచ్చిందని తెలిపారు. జీవో 560 ప్రకారం ప్రభుత్వ స్థలం ఉన్నచోట కొన్ని సొసైటీలకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. వీటన్నిటిని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని చెట్ల పెంపకం చేపట్టాలని డిమాండ్ చేశారు. వాటిని నరికిన వారిని కఠినంగా శిక్షించే చట్టం తేవాలని కోరారు. ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే రాబోయే కాలంలో చెట్లు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నిర్ణయించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ ఉపాధి కలిగే చర్యలు చేపట్టాలనీ, వృత్తిలో ప్రమాదాలు జరగకుండా, మరణాలు సంభవించకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, బాల్నే వెంకట మల్లయ్య, గౌని వెంకన్న, బొలగాని జయరాములు సహాయ కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, బండ కింది అరుణ్ కుమార్, గాలి అంజయ్య పాల్గొన్నారు.

సాగునీరు అందించండి

- పురుగుమందు డబ్బాలతో అన్నదాతల ఆందోళన
- చేతులెత్తేసిన నీటిపారుదలశాఖ అధికారులు

పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలంటూ ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఖమ్మం జిల్లా బోనకల్, మధిర మండలాల్లోని ఏడు గ్రామాల అన్నదాతలు పురుగుమందు డబ్బాలు చేత పట్టుకొని వైరా- జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై వత్సవాయి- బోనకల్ గ్రామాల మధ్య ఆందోళనకు దిగారు. మధిర మండలం అల్లినగరం, మడుపల్లి, బయ్యారం, దేశినేనిపాలెం, ఇల్లూరు, రాయపట్నం, బోనకల్ మండల పరిధిలోని మోటమర్రి గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు ఎండిపోయిన మిర్చి చెట్లను, పురుగుమందు డబ్బాలను తీసుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు శాఖమూరి కోటేశ్వరరావు, సూర్యదేవర సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ గ్రామాల్లో మొత్తం 7 వేల ఎకరాల్లో మొక్కజొన్న, వరి, మిర్చి పంటలను సాగుచేసినట్టు తెలిపారు. అధికారులతో మాట్లాడితే వెంటనే నీటిని సరఫరా చేస్తామని సమాధానం చెప్తారని ఆ తర్వాత అధికారులు ఇచ్చిన హామీ కూడా అమలు చేయడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 14న నీటిని విడుదల చేసి 22 వరకు ఇచ్చారని, జనవరి 29న నీటిని విడుదల చేసి ఫిబ్రవరి 4 వరకు ఇచ్చారని, ఫిబ్రవరి 12న నీటిని విడుదల చేసి 18 వరకు ఇచ్చారని, ఈ సమయంలో కూడా ఏనాడూ సాగర్ నీరు సక్రమంగా రాలేదని రైతులు తెలిపారు. ఆ తర్వాత నీటిని పూర్తిగా బంద్ చేశారని తెలిపారు. రెండు నెలల కాలంలో కేవలం 20 రోజులు మాత్రమే దాములూరు మేజర్‌కు సాగర్ నీటిని విడుదల చేశారన్నారు. 20 రోజుల్లో పంటలన్నీ ఎలా తడుస్తాయని ప్రశ్నించారు. ఆందోళన సమయంలో నీటిపారుదల శాఖ అధికారులతో రైతులు ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. కానీ వారు స్పష్టమైన సమాధానం చెప్పకుండా చేతులెత్తేయటం విశేషం. బోనకల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. దాంతో రైతులు తమకు స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు ఎట్టకేలకు మూడు గంటల అనంతరం రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు పాటిబండ్ల గిరిబాబు, చంపసాల గోపాలరావు, ధరావత్ చిట్టిబాబు, మర్రి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ఉండెడ ఎక్స్ రోడ్డు వద్ద మూడు గ్రామాల రైతులు రాజారాంపల్లి బసంత్ నగర్ రోడ్డుపై, రాస్తారోకో చేపట్టి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వందల ఎకరాల్లో కష్టించి సాగు చేసిన పంట పొలాలు నోటికొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం తాము భూములను దానం చేస్తే చివరికి మాకు ఉన్న భూములకు ప్రభుత్వం సాగునీరు అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి పంపు హౌస్ కోసం అండర్ గ్రౌండ్ నిర్మాణాలు చేపట్టి ఎస్సారెస్పీ డి83 మెయిన్‌కి అనుసంధానంగా ఉన్న కాలువను పూడ్చివేసి సాగునీరు సరఫరాకు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి పంపు హౌస్‌లను స్టార్ట్ చేసి ఎయిర్ వాల్వ్‌ల ద్వారా సాగునీరు అందించి పంట పొలాలను రక్షించాలని అధికారులను వేడుకొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్టు హెచ్చరించారు.

సర్జరీ అవసరం లేకుండా హార్ట్ ప్రొసీజర్

- 60 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కాపాడిన మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 60 సంత్సరాల వ్యక్తికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా గుండె ప్రొసీజర్ నిర్వహించిన బేగంపేటలోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. గుండెలో రంధ్రం, హార్ట్ ఫెయిల్యూర్ గుర్తించారు. ఇటువంటి పరిస్థితిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి రంధ్రం పూడ్చడం జరుగుతుంది. వయసురీత్యా డివైస్ క్లోజర్ విధానం కూడా చాలా కష్టతరమైనప్పటికీ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ దీపక్ సహా , డాక్టర్ సాకేత్, డాక్టర్ అవినాష్ దళ్‌లు గుండె కోత లేకుండా గుండె ప్రొసీజర్ నిర్వహించి రంధ్రాన్ని పూడ్చి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సాకేత్ మాట్లాడుతూ, ఇటువంటి గుండెపోటు వల్ల వచ్చే రంధ్రంతో హార్ట్ ఫెయిల్యూర్‌తో 80 శాతం మంది చనిపోతారన్నారు ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా తొడ భాగం నుండి డివైస్‌ని గుండెలోకి పంపి గుండె రంధ్రాన్ని మూసివేశామని చెప్పారు. సెంటర్ హెడ్ హృషీకేశ్ మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు , అధునాతన పరికరాలు, అనుభవజ్ఞులైన డాక్టర్స్ వల్లనే ఇటువంటివి సాధ్యం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగం డాక్టర్ దీపక్ , డాక్టర్ అవినాష్ దళ్ , డాక్టర్ అంగనా, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో 50 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాత్రి సమయంలో పాకలోని గొర్రెలపై వీధి కుక్కలు దాడి చేయడంతో.. 50 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. గొర్రెల యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. చందాపూర్‌కు చెందిన పాపమొల్ల ఎల్లయ్య తన గొర్రెల మందను పాకలోకి కొట్టి నిద్రకు ఉపక్రమించాడు. ఈ మందపై రాత్రి సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో 50 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. ఒక్కరాత్రిలో జీవనోపాధి లేకుండా పోయిందని కన్నీటి పర్యంతమవుతున్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. గ్రామంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ.. పశువులు, గొర్రెలు, మనుషులపై కూడా దాడులు చేస్తున్నాయని, వాటిని అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భాషా పరిరక్షణ అమల్లో అస్పష్టత

- బ్యాంక్ ఆఫ్ బరోడా మాతృభాషా వేడుకల్లో తెలకపల్లి రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని భాషలకు సమాన ప్రతిపత్తి కల్పిస్తున్నట్టు భారత రాజ్యాంగ అధికరణాల్లో ఉన్నా, ఇప్పటికీ దానిపై అస్పష్టతే ఉన్నదని ప్రముఖ భాష, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఆధిపత్యానికి ఇంగ్లీషు భాష కూడా ఓ కారణమని కారల్‌మార్క్స్ పేర్కొన్నారని చెప్పారు. మంగళవారం ఎమ్‌హెచ్ భవన్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయంలో 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' నిర్వహించారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ టివివిఎస్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి ప్రధాన వక్తగా మాట్లాడారు. పాలనాభాష, న్యాయభాష, వైద్య భాష ఓ పట్టాన ఎవరికీ అర్థం కావని చెప్పారు. వాటిని మాతృభాషల్లోకి మారిస్తే, ప్రజలకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భాషా పరిరక్షణ తిరోముఖంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీషు భాష నేర్చుకోవడం తప్పు కాదనీ, మాతృభాషను విస్మరించడం సరికాదనీ చెప్పారు. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలనీ, అవసరమైతే తప్ప ఆంగ్లం వాడొద్దని సూచించారు. మాతృభాషలోనే భావ వ్యక్తీకరణ స్పష్టంగా ఉంటుందన్నారు. ఇద్దరు తెలుగువాళ్లు కలిసి ఆంగ్లంలో మాట్లాడుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆంగ్ల పదాలు లేకుండా మాట్లాడితే తనలోనే ఏదో లోపం ఉందనుకుంటారనే భావన పెరిగిపోతున్నదనీ, ఫలితంగా చిత్ర విచిత్ర పదాలు పుట్టుకొస్తున్నాయన్నారు. భాషా, సంస్కృతులు ప్రపంచీకరణ (గ్లో'బలి') ప్రభావంలో కొట్టుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంకెలు పలకడం మొదలు బంధుత్వాల్లోనూ భాష మారుతున్నదనీ, ఆధిపత్యధోరణే దీనికి ప్రధాన కారణమని విశ్లేషించారు. తల్లిభాషలోనే ప్రాథమిక విద్యను సులభంగా నేర్చుకుంటారనీ, దీన్ని ప్రభుత్వాలు గుర్తించాలని సూచించారు. సొంత భాషపై పట్టులేకుంటే, పరాయి భాషను పూర్తిగా అభ్యసించలేరని అన్నారు. ప్రతిభాషకూ సౌందర్యం ఉంటుందనీ, తెలుగు భాష లయాత్మకమైందని తెలిపారు. భాషా నైపుణ్యాల మీద జరిగిన అధ్యయనాల్లో మన విధానం సమగ్రంగా లేదని తేలిందన్నారు. 1961 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 120కి పైగా భాషలు అంతరించిపోయాయని చెప్పారు. ప్రజా ఉద్యమాలు మాతృభాష నుంచే పుట్టుకొస్తాయన్నారు. భారత జాతీయోద్యమం గ్రంథాలయాలు వేదికగా సాగిందనీ, ఇక్కడ భాష ప్రధాన పాత్ర పోషించిందని ఉదహరించారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయం ముద్రించిన మాతృభాష మ్యాగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ విభాగాధిపతి సాయిరెడ్డి, ఆపరేషన్స్ విభాగాధిపతి జీ విజయకుమార్ పాల్గొన్నారు.

నన్నెంతగానో కలిచివేసింది : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీధి కుక్కల దాడిలో చిన్నారి మరణించటం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. ఈ ఘటన తనను ఎంతగానో కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. హైదరాబాద్ అంబర్‌పేటలో ఆదివారం ప్రదీప్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో ఆ పసివాడు మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కెటిఆర్ స్పందిస్తూ...బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామనీ, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామంటూ హామీనిచ్చారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

హైదరాబాద్ మహానగరంలో వీధి కుక్కల దాడుల నుంచి ప్రజలు, చిన్నారులను కాపాడటంలో జీహెచ్ఎంసి ఘోరంగా విఫలమైందని డివైఎఫ్ఐ విమర్శించింది. వాటి నిర్మూలన కోసం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరింది. వీధి కుక్కలకు ఇంజక్షన్లు ఇచ్చి వదిలేయకుండా శాశ్వత నివారణా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాలుడి కుటుంబానికి తగిన విధంగా న్యాయం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

పట్టాలు అందేవరకూ పోరాటం

- పేదలంతా ఐక్యంగా పోరాడితేనే ఇండ్లు, ఇండ్ల స్థలాలు.
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండ్ల స్థలాల కోసం పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటం ఆపేదే లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతాలను మంగళవారం ఆయన సందర్శించి గుడిసెవాసులను ఉద్దేశించి మాట్లాడారు. భూపాలపల్లి పట్టణంలోని పాత ఎర్ర చెరువు శిఖం భూమిలో సర్వే నెంబర్-280, 283, 284, 285లోని సుమారు 24 ఎకరాల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 28 రోజులు కిందట సుమారు 3500 గుడిసెలు వేసుకున్న విషయం తెలిసిందే. వీరికి మద్దతు తెలిపేందుకు మంగళవారం వచ్చిన సుదర్శన్‌కు గుడిసెవాసులు బైక్‌ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆస్ ప్రభుత్వాలు నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కట్టిన పాపాన పోలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్కడక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించినా ప్రజలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. గూడు లేని నిరుపేదలంతా ఐక్యంగా పోరాడితేనే ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కుతాయని స్పష్టంచేశారు. కమ్యూనిస్టులు నిరంతరం పేద ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్చి నెలలో పార్టీ ఆధ్వర్యంలో గుడిసె వాసుల పట్టాల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు కామన్ బ్రాండింగ్

- ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో మరిన్ని ఒప్పందాలు
- సెర్ప్ అధికారులతో సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పేరు ప్రతిష్టలు ఉట్టిపడేలా, మహిళా ఉత్పత్తులు సులువుగా అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడు పోయేలా కామన్ బ్రాండింగ్ చేయాలనీ, అందుకు తగ్గట్టు పలు పేర్లను పరిశీలించాలని సెర్ప్ అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్, లేబిలింగ్ కోసం ప్రయత్నాలు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి, సెర్ప్ సిఇఒ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ అధికారి రజిత, ఇతర అధికారులతో మంగళవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డ్వాక్రా ఉత్పత్తులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మన రాష్ట్ర మహిళా సంఘాలు తయారు చేస్తున్న వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆ డిమాండ్‌కు తగ్గట్టుగా, మరింత ఆకర్షణీయంగా లే బిలింగ్, ప్యాకింగ్ చేసేలా చూడాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే అమెజాన్, ఫ్లిప్‌కార్డు లాంటి ఆన్‌లైన్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలి
- గ్రామపంచాయతీ కార్మికుల పాదయాత్రలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కనీస వేతనం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న జనగామ జిల్లా పాలపర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం నుంచి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ పని విధానం రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు, భవిష్యత్ పోరాట కార్యాచరణ ప్రణాళిక అంశాలపై వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈనెల 28న ఇందిరాపార్కు వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 12 ఏండ్లలో జనాభా పెరిగినా.. వారికి తగ్గట్టుగా కార్మికులను పెంచలేదన్నారు. తెలంగాణలో మల్టీ పర్పస్ పని విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల కారోబార్ పరిస్థితి దీనంగా మారిందన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రభుత్వం వెంటనే అందించాలన్నారు. తమ పాదయాత్ర ముగిసేలోగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. లేకుంటే సీఐటీయూ, జీపీ కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి

- కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి
- రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైల్వేల ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. స్టేషన్ డైరెక్టర్ ప్రభు చరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. అదానీ, అంబానీల కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తూ ప్రజల ఆస్తి అయిన రైల్వేను ప్రయివేటుపరం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. వెంటనే ఆ పనిని ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వేలు ప్రయివేటుపరం కావడం వల్ల ఉద్యోగులకే కాకుండా సామాన్య ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే చార్జీలు పెరుగుతాయని, ప్యాసింజర్ రైళ్లు తగ్గి వందే భారత్ లాంటి ట్రైన్‌లు వస్తాయన్నారు. గూడ్స్ రైళ్లను ప్రయివేటుపరం చేయడం వల్ల సిమెంటు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఎరువులు, పప్పులు, బియ్యం, పండ్లు తదితర నిత్యావసర సరుకుల ధరలు కూడా ఆకాశాన్ని అంటే ప్రమాదం ఉందన్నారు. నేషనల్ పెన్షన్ స్కీమ్ 2004ను రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.18,486 ఇవ్వాలని కోరారు. చట్ట ప్రకారం ప్రతినెలా 7వ తేదీన వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సౌకర్యాలు అమలు చేయని కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేయాలని, వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. రైల్వేల రక్షణ కోసం రైల్వే ఉద్యోగులు, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు, ప్రజలు ఒకే తాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర సహాయ కార్యదర్శులు జి.రాములు, డీఎల్ మోహన్, హైదరాబాద్ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస రావు, శ్రీశైలం, పద్మ, సునీత, గీత, సజీవమని, జ్యోతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే కార్మికులు చేపట్టిన నిరసనలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు సి.మల్లేష్ పాల్గొని మాట్లాడారు. గతంలో రైల్వేలో 17 లక్షల మంది ఉద్యోగులు ఉండగా.. ప్రస్తుతం అది 13 లక్షలకు తగ్గిపోయిందని, ప్రభుత్వం ఇంకా తగ్గించే ఆలోచనలో ఉందని చెప్పారు.

గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ

- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమైఖ్య చైర్మన్ బాలరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గొల్ల కురుమలు ఆర్థికంగా బలపడేందుకు సిఎం కెసిఆర్ గొర్రెల పంపిణీ పథకం అమలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమైఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల గొల్ల కురుమలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ పథకం ద్వారా ఏడు లక్షలకుపైగా గొల్ల కురుమల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు తెలిపారు. 50 ఏండ్లు నిండిన గొర్రెల కాపర్లకు పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రెండో విడతలో నగదు బ్యాంకులో జమకాని కొంతమంది లబ్దిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గొర్రెలను పారదర్శకంగా లబ్దిదారులకు అందించేందుకు అధికారులు పనిచేయాలన్నారు. 75శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంస్థాన్ నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాదేవి ప్రేమ్‌చందర్‌రెడ్డి, జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి వెంకటేశ్‌గౌడ్, జేడీఏ కృష్ణ, ఎడి అయిలయ్య, సింగిల్‌విండో చైర్మెన్లు చింతల దామోదర్‌రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, జీఎంపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు బండారు నర్సింహా పాల్గొన్నారు.